

# ఇప్పుడూ ఇక్కడా

—పాపినేని శివశంకర్

**నీలిమ తీవ్రంగా ఆలోచిస్తోంది తన గదిలో కూర్చుని. రేపు స్కూల్లో బొమ్మల పోటీ. ఏం బొమ్మ వెయ్యాలి? ఎంత ఆలోచించినా తట్టటం లేదు. ఇంతకు ముందు వేసిన బొమ్మలు చాలా వున్నాయి. కొన్నిటికి బహుమతులు కూడా వచ్చాయి.**

ఈసారి ఇంకా మంచి బొమ్మ వెయ్యాలి. పాత బొమ్మలన్నీ ఒక్కసారి తిరగేసింది నీలిమ. వాటిల్లో పెన్సిల్ స్కెచ్‌లే ఎక్కువ వున్నాయి. నీటి రంగుల్తో వేసినవి తక్కువ. తనకి పెన్సిల్ స్కెచ్‌లే బాగా ఇష్టం. ప్రకృతి దృశ్యాలూ, మనుషుల బొమ్మలూ నేరిపగంగా వున్నాయి. అన్నిటిలోనూ — సముద్ర కెరటాల నేపథ్యంలో ఒక మనిషి, కుక్కా పరదాగా పోటీపడి పరుగెత్తుతున్నట్టు వేసిన బొమ్మ తనకెంతో ఇష్టం. మేనమామ గోపీ కూడా ఆ బొమ్మ చూసి ఎంతో ముచ్చటపడ్డాడు. ప్రకృతిలోని సామరస్యం అందులో వుందన్నాడు. మావయ్యే తనకి బొమ్మలు వెయ్యడం నేర్పింది.

నీలిమ ఆలోచనలు సాగుతుండగానే వరండాలో తండ్రి జగదీశ్వర్రావు ఎవరితోనో గట్టిగా మాట్లాడుతున్నాడు. కిటికీలోంచి చూసింది నీలిమ. తండ్రి కెదురుగా వరండా మెట్ల కింద కన్నయ్య నిలబడి వున్నాడు. రోజూ తనని రిక్షాలో స్కూలుకి తీసుకెళ్ళే మనిషి.

"ఇంకా ఫస్ట్ తారీకే రాలేదు. పైగా రెండొందలివ్వాలా? బావుందిరా నీ వరస" అంటున్నాడు జగదీశ్వర్రావు.

"కాదయ్యా! మా ఇంటిది కడుపుతో వుంది. ఆస్పత్రిల్లో జేర్పిచ్చా. రెండ్రోజుల్లో నీళ్ళాడుద్దని డాట్టరు జెప్పాడు. జేబులో పిల్లిగవ్వ లేదు. ఎట్టాగైనా తమరు..."

"నీ పెళ్ళాం నీళ్ళాడితే నాకేం? పాలాడితే నాకేం? ఫస్ట్ తారీకు రాక ముందు డబ్బు అడగొద్దని ఏడాది మొదట్లో రిక్షా మాట్లాడుకున్నప్పుడే చెప్పాను. చెప్పానా లేదా?"

కన్నయ్య తలూపాడు.

"మరిప్పుడు డబ్బడిగితే ఎలా కుదురుతుంది? పద్ధతంటే పద్ధతే" అన్నాడు జగదీశ్వర్రావు. చేతిలో పేపరు విసుగ్గా టీపాయ్ మీదికి విసిరేసి టైం చూసుకున్నాడు. అర్జంటుగా బయటికి వెళ్ళాలి.

పంక్చువాలిటీని ఖచ్చితంగా పాటించే వ్యక్తి జగదీశ్వర్రావు. ఆరు నూరైనా అనుకున్న టైంకి అనుకున్న పని జరగాల్సిందే. ఫ్రెండ్సంతా తన పంక్చువాలిటీని అభినందిస్తుంటారు, ఒక్క మనోహర్ తప్ప. వాడు మాత్రం 'నీ పంక్చువాలిటీ అంతా నీకు లాభించే విషయాల్లోనే శేవోయ్' అంటాడు. దానికేమిటి? లైఫంటే గొప్ప ప్లాన్ (ఇది తనకి చాలా ఇష్టమైన వాక్యం). మరి ఏ ప్లానైనా పకడ్బందీగా వుండాల్సిందే.

తను పట్టణంలో మంచి ఆర్కిటెక్ట్‌గా ఇప్పుడిప్పుడే లైమ్‌లైట్‌లోకి వస్తున్నాడు. ఆ రోజు తొమ్మిదింటికి పెద్ద పార్టీ వస్తుంది ఆఫీసుకి. త్రీస్టార్ హోటల్ ప్లాన్ ఇవ్వాలి. అసిస్టెంట్స్ సహాయంతో రాత్రింబగళ్ళు కష్టపడి ఖచ్చితంగా మూడు రోజుల్లో మూడుప్లాన్స్ సిద్ధం చేసి వుంచాడు. అన్ని డిటెయిల్సూ వర్క్ అవుట్ చేశాడు. ఎలివేషన్ బ్రహ్మాండంగా వచ్చింది. ఎవ్వరూ వంక పెట్టే వీల్లేదు. వాళ్ళు ఓకే అన్నారంటే ప్లాన్స్, ఎస్టిమేట్స్, సూపర్‌విజన్లలో కనీసం డెబ్భై ఎనభై వేలన్నా దక్కుతాయి. త్వరగా వెళ్ళాలి. కానీ సరిగ్గా ఎనిమిదీ నలభైకి ఈ అపశకునపక్షి పట్టుకున్నాడు. ఓ పట్టాన వదలడాయె.

"అట్టాగంటే ఎట్టా బాబూ? సేనం మీదకొచ్చి అడిగాను కానీ నాట్టప్పుడు అడిగే నోణ్ణి గాదు. అక్కడికీ మందులికీ అటికీ బాకీ చేశా. ఆపరేసను జెయ్యాల్సుంటదన్నారు డాట్టరుగారు. ఇంకెక్కడా అప్పు బుట్టదు. నువ్వుదు మీరు దప్ప దిక్కు లేదు" అన్నాడు కన్నయ్య. హాస్పిటల్లో భార్య గుర్తుకొచ్చి కళ్ళమ్మట నీళ్ళు తిరిగాయి.

కన్నయ్య మొహం చూసేకొద్దీ జగదీశ్వర్రావుకి చిరాకు ఎక్కువవుతోంది. శుభమాంటూ తను బయల్దేరబోతుంటే ఈ ఏడుపులేమిటి? 'ఈ లేబరు నెధవల్తో ఇదే న్యూసెన్స్, పట్టుకుంటే వదిలిచావరు గదా?' అనుకున్నాడు. 'అయినా వీడికి లొంగిపోతానా?' ఎందుకో జగదీశ్వర్రావుకి వాడికి డబ్బిస్తే హోటల్ పార్టీ వ్యవహారం చెడిపోతుందని శకునం తోచింది. తక్షణం కన్నయ్యతో ఖరాఖండీగా చెప్పేశాడు.

"ఒరే, నువ్వు వందసార్లడిగినా లాభం లేదు. ప్రస్తుతం నా దగ్గర కూడా డబ్బు లేదు... అదే పని మీద పోతున్నా. ఇంకెక్కడన్నా చూసుకో. స్కూలుకి టైమవుతోంది. అమ్మాయిని తీసుకెళ్ళు" అంటూ గబుక్కున లేచాడు — "నీలూ! గెట్ రెడీ" అంటూ స్కూటర్ బయటికి తీశాడు.

స్కూటర్ ఒక పట్టాన స్టార్ట్ కాలేదు. జగదీశ్వర్రావులో గాభరా పెరిగింది. 'ఆలస్యమైతే అవతల పార్టీ ఏమనుకుంటారు? నాన్సెన్స్!! ఈ వ్యవహారం సెట్‌రైట్ అయితే నెధవది, స్కూటర్ అమ్మేసి కారు కొనాలి.' బర్... బర్‌ర్‌ర్... 'థాంక్ గాడ్! స్టార్టయింది' స్కూటర్ స్పీడుగా వెళ్ళిపోయింది.

నీలిమకి కన్నయ్యని చూసేకొద్దీ జాలేసింది. అతని మొహంలో కళాకాంతుల్లేవు. నిర్లిప్తంగా రిక్షా తుడుచుకుంటున్నాడు.

జగదీశ్వర్రావు రాత్రే వెయ్యి రూపాయలు బీరువాలో దాయడం చూసింది నీలిమ. అందులో రెండు వందలిస్తే ఏం? కాకపోతే ఈ నెలా, వచ్చే నెలా రిక్షా డబ్బు లివ్వకపోతే సరిపోతుంది గదా! మనిషికి డబ్బు నిజమైన అవసరాలు తీర్చుకోవడానికేనంటాడు గోపీ మావయ్య. నిజమైన అవసరాలంటే ఇలాంటివే గదా! కన్నయ్య ఎంత మంచివాడు? ఏడాదిలో ఒక్క రోజు కూడా నాగా పెట్టలేదు. రిక్షా మీద ఎంత జాగ్రత్తగా, నిదానంగా తీసుకెళ్తాడో తనని? ఎప్పుడన్నా తను తొందరపెట్టినా 'ఆలిస్పెమైతే అయింది

లేమ్మా! స్పీడుగా ఎళ్తే ప్రమాదం' అంటాడు. పాపం, అతని భార్య కెట్లా వుందో?... నీలిమ ఆలోచనలు పరిపరి విధాల పోతున్నాయి. తనకా తండ్రితో చెప్పే ధైర్యం లేదు. ఊరికే కోప్పడతాడు.

నీలిమ భోంచేస్తూ తల్లితో కన్నయ్య సంగతి చెప్పింది.

"నేనూ విన్నాన్లే. ఏం చేస్తాం?" అంది అరుంధతి తేలిగ్గా.

"అమ్మా! పోనీ, నీ దగ్గరేమీ డబ్బు లేదంటే?" అడిగింది నీలిమ.

"ఉన్నాయిగానీ చిన్న మోహినికి త్రీహండ్రెడ్ ఇవ్వాల్సి వచ్చింది. ఇవాళన్నా ఇవ్వాలి."

ఎందుకివ్వాల్సి వచ్చిందో నీలిమకి తెలుసు. లేడీస్ క్లబ్‌లో ప్రతి రోజూ ప్లేకార్డ్సు ఆడుతుంది అరుంధతి.

"ఇంకొక రోజు ఇవ్వొచ్చులేమ్మా! పాపం, కన్నయ్య కెంత అవసరంగా వుందో?"

"ఉంటే మాత్రం? ఊళ్ళోవాళ్ళ అవసరాలన్నీ నువ్వూ, నేనూ తీర్చాలా ఏమిటే? ఇవ్వాళ మోహినికి డబ్బివ్వకపోతే ప్రెస్టేజ్ పోదూ?... నువ్వు క్విక్‌గా కానిచ్చి స్కూల్‌కి పద" అంది అరుంధతి విసుగ్గా.

ఏదో అనబోయి మానేసింది నీలిమ. మరింత చనువు తీసుకోవడాన్ని తల్లి సహించదు. చెయ్యి కడుక్కుని స్కూల్‌కి బయల్దేరింది.

ఆ రోజంతా క్లాసు పాఠాల మీద మనస్సు నిలవ లేదు. సెకండ్ పీరియడ్‌లో నోటీస్ వచ్చింది, రేపటి చిత్రలేఖన పోటీలో పాల్గొనేవాళ్ళ పేర్లిమ్మని. అన్యమనస్కంగానే పేరిచ్చింది నీలిమ. 'ఏం బొమ్మ వెయ్యాలి రేపు? వాటర్ కలర్స్‌లో వేస్తేనే బావుంటుందేమో?... కన్నయ్య భార్య కెలా వుందో? ఆపరేషన్ ఏమవుతుందో...' ఈ ఆలోచనల్లో పడిపోయి ఇంగ్లీష్ టీచర్ ప్రశ్నకి సరిగ్గా జవాబు చెప్పలేకపోయింది.

"వాట్ ఆర్యూ థింకింగ్ నీలిమా?" ప్రశ్నించింది టీచర్.

"నథింగ్ మేడమ్" తడబడుతూ అంది నీలిమ. క్లాసులో నలుగురైదుగురు నవ్వారు.

"సైలెన్స్" అంది టీచర్. తర్వాత నీలిమ జవాబు చెప్పలేకపోయిన ప్రశ్నని శ్రీవిద్య నడిగింది. శ్రీవిద్య క్లాసులోకల్లా బ్రిలియంట్ స్టూడెంట్‌గా పేరుతెచ్చుకుంది. దానికి తగినట్టుగానే నాజూగ్గా, కించిత్తు హుందాగా లేచి నిలబడి సమాధానం చెప్పింది.

"ఐ షల్ హేవ్ పాస్డ్ బి.టెక్. బై దెన్."

"వెరీగుడ్. సిట్ డౌన్" అంది టీచర్.

'కొయ్య బొమ్మలు మెచ్చు కళ్ళకు కోమలుల సొరెక్కునా?' ఎక్కదు. అలాగే, ఎప్పటికప్పుడు తాము గొప్పనుకునే తప్పుడు ప్రమాణాల వైపు పరుగులెత్తే మనుషులకు సజీవ మానవ సంబంధాల సహజ స్పందన తెలీదు. వర్తమానం ఆ పరుగు పందెమే అయినప్పుడు, 'ఎప్పుడూ ఎక్కడా' అన్నది లేదు, 'ఇప్పుడూ-ఇక్కడా' తప్ప.

శ్రీవిద్య సంతోషంగా చుట్టూ చూస్తూ కూర్చుంది. తనూ చెప్పగల ఉదాహరణే. కానీ మనస్సులో వేరే ఆలోచనలు. ఫ్యూచర్ పర్‌ఫెక్ట్ టెన్స్. నిజానికి ఫ్యూచర్ టెన్స్ అనేదుందా? ఫ్యూచర్ గురించి ఎవరికి తెలుసు? శ్రీవిద్య బి.టెక్. పాసవుతుందా? ఆలోగా పెళ్ళయి చదువాగిపోతే? కన్నయ్య భార్యకి ఆపరేషన్ జరుగుతుందో లేదో? ఆమె కేమవుతుందో ఎవరు చెప్పగలరు? రేపేం జరుగుతుందో అనేది కాక ఇప్పుడేం చెయ్యాలనేది చాలా ముఖ్యమైంది గదా! మరి అమ్మా, నాన్నా ఎప్పుడూ తన భవిష్యత్తు గురించి ఆందోళన పడుతుంటారు.

క్లాసులో శ్రీవిద్యకీ, కుమారికీ ఎప్పుడూ పోటీనే. ఫస్ట్ మార్క్సు సంపాదించడం కోసం ఎంత తాపత్రయమో ఇద్దరికీ! ఒకళ్ళు ఇంజనీర్ అవుతానని, మరొకళ్ళు డాక్టర్ అవుతాననీ! ముందు ముందు నేనింకా మంచి మనిషినవుతానని మాత్రం ఎప్పుడూ చెప్పరు. స్కూల్ కాగానే ట్యూషన్లే ట్యూషన్లు. ఆన్సర్ పేపర్ మీద ఫస్ట్ మార్క్సు చూసుకున్నప్పుడు వాళ్ళ కెంత గర్వమో? వాళ్ళిద్దరూ ఎప్పుడన్నా మాట్లాడుకోవడం తనింతవరకూ చూళ్ళేదు. తనకీ ఎప్పుడన్నా ఫస్ట్ మార్క్సు వస్తుంది, ముఖ్యంగా మేథమేటిక్స్‌లో. అయినా అందులో తన కెందుకో ఆనందం కలగదు. ఆమధ్య స్కూల్‌కి ఒక అనాథ కుర్రాడు వచ్చాడు. దుస్తులు చిరిగిపోయున్నాయి. బలహీనంగా దీనంగా వున్నాడు. క్లాసులో తలా రూపాయో అర్ధో ఇచ్చారు. తన దగ్గర ఐదు రూపాయలున్నాయి. ఐదూ ఇచ్చేసింది. ఆ పిల్లాడి కళ్ళు మెరిశాయి. అప్పుడు తనకెంత సంతోషం కలిగిందో...!

సాయంత్రం నీలిమ స్కూల్ నుంచి ఇంటికి వచ్చేపాటికి ఐదయింది. అదే సమయానికి అరుంధతి కూడా క్లబ్ నుంచి వచ్చింది. ఎంతో కొంత పోగొట్టుకునే వుండాలి ఈ రోజు కూడా.

"ఏమిటే అలా వున్నావు?" కూతురి మొహం చూసి అడిగింది అరుంధతి.

"ఏం లేదమ్మా!" అంది తను నిర్లిప్తంగా.

నేరుగా డాబా మీదకి వెళ్ళి కూర్చుంది. పొద్దుకుంకుతోంది. సాయంకాలాన

(మిగతా 18వ పేజీలో)



# ఈ వారం కథ

(15వ పేజీ తరువాయి)

పడమటి ఆకాశంలో వ్యాపించే రంగులంటే ఎంతో ఇష్టం తనకి. అంత స్వచ్ఛమైన రంగులు ఏ బొమ్మల్లోనూ కనబడవు. ఇంతకీ రేపు పోటీలో ఏం బొమ్మ వెయ్యాలి?

"నీలూ!"

తిరిగి చూసింది నీలిమ. నాన్న ఇవాళ ఆఫీసు నుంచి త్వరగా వచ్చాడు.

"ఇక్కడ కూర్చున్నావేమిటి?"

"సూర్యాస్తమయం చూస్తున్నా నాన్నా!"

"ఏం మొహం. ఏముందే అందులో చూడ్డానికి? ప్రతి రోజూ వుండేదే గదా? ఎగ్జామ్స్ దగ్గరపడుతున్నాయి గదా? డోంట్ వేస్ట్ యువర్ టైమ్. టైమ్ ఈజ్ మనీ. కమాన్, కిందికి పద. చదువుకుందువుగానీ"

నీలిమ మాట్లాడలేదు. నిజమే. సూర్యాస్తమయం రోజూ వుండేదే. కానీ ప్రతి రోజూ ఎంత కొత్తగా వుంటుంది? ఎన్నెన్ని రంగులు! మబ్బులు మెల్లగా కదుల్తూ, పిట్టలు ఎగురుతూ ఆకాశం ఎంత అందంగా వుంటుంది? నాన్న కివేం తెలీవా?

మెల్లగా కిందకి దిగి వచ్చింది. స్నానం చేసి చదవడానికి కూర్చుంది. స్టడీ రూమ్. టెడ్ బుక్స్. ఏ పుస్తకంలోనూ బొమ్మల గురించి కానీ, సంగీతం గురించి కానీ వుండదు. అయినా చదవాలి. నాన్న ఇష్టం ప్రకారం ఇంజనీరే కావాలి. ఆ తర్వాత ... చదువు మీద మనస్సు నిలవడం లేదు. బెడ్‌రూంలోంచి నాన్న మాటలు విన్పిస్తున్నాయి.

"అయామ్ వెరీ హేపీ. నేను చెప్పానే, త్రీస్టార్ హోటల్ సంగతి? మన ప్లాన్ ఓకే చేశారు. ఇదుగో అడ్వాన్స్. టెన్ థౌజండ్!"

"టెన్ థౌజండ్!" ఆశ్చర్యానందాలతో అంది అరుంధతి నోట్ల కట్ట అందుకుంటూ. "గ్రేట్! హౌ నైస్ యు ఆర్!"


"దిసీజ్ జస్ట్ ఎ బిగినింగ్. ఓవరాల్ ఎస్టిమేట్‌లో టూ పర్సెంట్ అడిగాను. వెంటనే ఒప్పుకున్నారు. ఈ వ్యవహారంలో ఎంత లేదన్నా ఎనభై వేలొస్తాయి."

"ఎనభై వేలే!! యు ఆర్ రియల్లీ గ్రేట్ జగ్గూ!"

"థాంక్యూ, కానీ తీరా వాళ్ళు అడ్వాన్స్ ఇచ్చింతర్వాత పశ్చాత్తాపం కలిగిందోయ్. ఇంకో పర్సెంట్ అడిగివుంటే బావుండేది."

"పోనీలెండి. ప్రస్తుతానికి సంతృప్తిపడదాం."

"నోనో.. నే నొప్పుకోను. ఎక్కడికక్కడ సంతృప్తి పడితే ఈ కాంపిటేషన్‌లో ముందుకేం వెడతాం? ఇంకా సంపాదించాలి. లేకపోతే మనిషి సామర్థ్యం ఏముంది? అంతా మన నీలూ కోసమే గదా? రెండు మూడేళ్ళలో దాని పెళ్ళి గ్రాండ్‌గా చెయ్యొద్దూ? మంచి బిల్డింగ్ ఇంకోటి కట్టాలి. చూస్తుండు. నీలూ పెళ్ళినాటికి ఇంకా నాలుగైదు లక్షలన్నా సంపాదిస్తాను."




... ఫ్యూచర్ పర్‌ఫెక్ట్ టెన్స్. ఎంత పర్‌ఫెక్ట్‌గా చెబుతున్నాడు నాన్న? వాట్ ఎబౌట్ ప్రెజెంట్ టెన్స్?...

"... ఫేవ్ ఆడుకుందాం నాన్నా!"

"నా కిప్పుడు నీలుకాదమ్మా!"

"...సాయంత్రం సినిమా కెళ్దాం నాన్నా!"

"నో బేబీ! ఈవెనింగ్ ఫలాని బిల్డింగ్ సూపర్‌వైజ్ చెయ్యాలి."

..."ఈ బొమ్మ చూడు నాన్నా, ఇవాళే వేశాను."

"హా.. ఎప్పుడూ బొమ్మలే. స్టడీస్ మీద కాన్‌సంట్రేట్ చెయ్యి. బాగా చదివి ఇంజనీర్‌వి కావాలి."

ఎవ్విరిథింగ్ ఎబౌట్ ఫ్యూచర్. వాట్ నౌ. ఇంకా ఇంకా డబ్బు సంపాదించాలి, ఫ్యూచర్ కోసం. నాన్న ఆ నోట్ల కట్టల్లో ఒక్క కాగితం కూడా కన్నయ్యకివ్వడు, కనీసం అడ్వాన్సుగా. ఆ కాగితం కట్టల్ని చూసి ఎంతో సంతోషపడతాడు. తన బొమ్మల కాగితాల్ని చూసి ఎన్నడూ సంతోషించడు. అన్నట్టు రేపేగా బొమ్మల పోటీ? ఏమీ తోచడం లేదు.

అయినా ఎప్పుడో వెయ్యాల్సిన బొమ్మని గూర్చి ఇన్ని రోజుల్నుంచి ఎందుకాలోచిస్తోంది తను? కళలో టైమ్ అండ్ మూడ్ చాలా ముఖ్యం అంటాడు గోపీ మావయ్య. వాటిల్లోకి బుర్రని కావాలని ఇరికించగూడదంటాడు. తనకీ తెలుసు, సరైన మూడ్‌లో వెయ్యని బొమ్మలు సహజంగా వుండవని, ఇప్పటి తన ఆలోచనలు కూడా టైమ్‌లీగా లేవు. రేపు నిజంగా బొమ్మ వెయ్యాలనిపిస్తే, వెయ్యగలిగితే వేస్తుంది. లేకుంటే లేదు... ఇలా నిర్ణయించుకుని నిశ్చింతగా పడుకుంది నీలిమ.

మర్నాడు ఎప్పటిలాగే స్కూలుకి బయల్దేరింది. కన్నయ్య సాధారణంగా రిక్షా తొక్కేటప్పుడు మౌనంగా వుండడు. కుటుంబ విషయాలో, నిన్నటి రిక్షా బేరాలో, రాత్రి చూసిన సినిమా సంగతులో — ఏదో ఒకటి చెబుతూనే వుంటాడు. అతని మాటల్తో రిక్షా మువ్వల చప్పుడు శ్రుతిగలుపుతుంటుంది. కానీ ఆ రోజెందుకో మౌనంగా వున్నాడు. రిక్షా కూడా నత్తనడక నడుస్తోంది.

"ఏంటి కన్నయ్యా! అట్లా వున్నావేం?" అడిగింది నీలిమ.

కన్నయ్య మెల్లగా గొంతు విప్పాడు "యాపుందమ్మా! మా యాడదానికి ఆపరేసనయ్యింది. దేవుడి దయవల్ల తల్లీ పిల్లా బాగానే వుండారు ఇప్పటికి. డబ్బులే సాల్లా మందులికి. ఇయ్యాల రిచ్చా తాకట్టు పెడతన్నా. అమ్మగారికి జెప్పి. మల్లీ తాకట్టు ఇడిపించుకుందాకా ఎట్టోకట్టా మిమ్మల్ని బడికి పంపిచ్చమని."

"కూతురు పుట్టిందా? మరి నాకు చెప్పలేదేం?"

"ఆ సెప్పకోడానికేం వుందిలేమ్మా!" అన్నాడు కన్నయ్య రిక్షా వీధి మలుపు తిప్పుతూ.

"ఏ హాస్పిటల్లో వున్నారు?"

కన్నయ్య చెప్పాడు.

"పాపని చూద్దాం పద. దగ్గరేగా?"

"వొద్దులేమ్మా! బడికి ఆలిస్సెమవుద్ది."

"అయితేకానీలే అటు వైపు తిప్పు రిక్షా!" అంది నీలిమ నిశ్చయంగా.

కన్నయ్య అయిష్టంగానే పక్క వీధిలోకి రిక్షా తిప్పాడు. జనతా నర్సింగ్ హోమ్ ముందు రిక్షా ఆగింది. నీలిమ గబగబా రిక్షా దిగి లోపలికి నడిచింది. కన్నయ్య నీలిమ స్కూల్ బ్యాగ్ తీసుకుని వచ్చాడు వెనగ్గా.

హాస్పిటల్‌లో ఒక మూల మామూలు గదిలో వున్నారు కన్నయ్య భార్యా, పసిపిల్లా. గదిలో గాలీ, వెలుతురూ అంతగా లేవు. అద్దె బాగా తక్కువై వుండాలి. గదంతా పురిటి వాసన. నీలిమని చూసి ఆశ్చర్యపోయింది కన్నయ్య భార్య. పక్కనే ఉయ్యాల తొట్టిలో నిద్రపోతోంది పసిపిల్ల. తెల్లగా, బొద్దుగా వుంటుందని ముందు ఊహించుకుంది నీలిమ. కానీ సన్నగా, చామనఛాయలో వుంది పిల్ల. ఒళ్ళంతా కందిపోయినట్టుంది. మెల్లగా దాన్ని పొత్తిళ్ళతోపాటు తీసుకుంది. చిన్న నోరు, బుల్లి బుల్లి కాళ్ళు, చేతులు. దాన్ని చూసేకొద్దీ తెలీని ఆనందం కలుగుతోంది నీలిమకి.

"ఇంక పదండమ్మా!" అన్నాడు కన్నయ్య తొందర చేస్తూ.

నీలిమ అయిష్టంగానే బయటికి నడిచింది. మళ్ళీ ఏదో గుర్తొచ్చి ఆగింది. చేతి

పర్సులో పది రూపాయలున్నాయి. అవి తీసి కన్నయ్య భార్య కిచ్చింది.

"పాపకి మంచి గిలక్కాయ కొని పెట్టు" అని చెప్పింది.

కన్నయ్య భార్య పది రూపాయల నోటుని భద్రంగా తీసుకుంది. నీలిమ హాస్పిటల్ వెలుపలికి వచ్చి రిక్షా ఎక్కగానే కన్నయ్య గబగబా లాగి సీటెక్కాడు.

"అయితే కన్నయ్యా! హాస్పిటల్ బిల్ కోసం రిక్షా తాకట్టు పెడుతున్నావా?" అడిగింది నీలిమ.

"అంతేనమ్మా!" అన్నాడు కన్నయ్య.

"మరి రిక్షా లేకపోతే రోజూ డబ్బులెట్లా సంపాదిస్తావ్?"

కన్నయ్య మాట్లాడలేదు. నీలిమకి రాత్రి అమ్మతో నాన్న మాట్లాడిన మాటలు గుర్తొచ్చాయి. ఒక్క ప్లాన్ గీసినందుకు నాన్న కెంత డబ్బు వస్తోంది? మరి రోజంతా రిక్షా లాగుతున్నా కన్నయ్య దగ్గర డబ్బు లెందుకు లేవు? జ్వరం వచ్చినా రిక్షా తొక్కడం మానడు. పోనీ, నాన్న దాచి పెట్టిన నోట్ల కట్టల్లో ఒకటి కన్నయ్యకిస్తేనో? అమ్మో! నాన్న చంపెయ్యడూ? ఏమీ తోచక కన్నయ్య వైపే చూస్తూ కూర్చుండిపోయింది నీలిమ. సీటు మీద మంచి అతని వీపు మాత్రమే కన్పిస్తోంది. ఎప్పటిదో పాతది, భుజం మీద చిరిగిన చొక్కా. మాసిక వేసి వుంది. మనిషిలో ఏ మాత్రం బలం లేనట్టు సంతోషం లేనట్టూ రిక్షా మెల్లగా సాగుతోంది. అకస్మాత్తుగా నీలిమకి ఆ రోజు పోటీలో ఏం బొమ్మ వెయ్యాలో తోచింది. ఆ బొమ్మ వేస్తేనన్నా మనసులోని బాధ తగ్గుతుందేమో. ఒక్కో బొమ్మ వేసినప్పుడు మనస్సు తేలికపడడం, ఎంతో ఆనందం పొందడం తన అనుభవంలోనిదే. ఏదైనా మంచి ఊహ తట్టినప్పుడు దానికి రూపం ఇచ్చిందాకా మనస్సులో ఏదో అశాంతి. ఆ తర్వాత రోజుం తరబడీ వదలని అనుభూతి.

స్కూల్ వార్షికోత్సవం. నీలిమ అమ్మా, నాన్న లిద్దర్నీ స్కూల్‌కి తీసుకెళదామను కుంది. కానీ జగదీశ్వరరావు ఏవో బిల్డింగ్ ఎస్టిమేట్స్ తయారుచెయ్యాలి గనక తనకి వీలుకాదని చెప్పి వెళ్ళిపోయాడు. అరుంధతికి క్లబ్‌లో ఫంక్షనుంది. నీలిమ నిరుత్సాహంగా వెళ్ళింది స్కూలుకి.

వార్షికోత్సవానికి ముఖ్యఅతిథిగా కేశవరావు అనే వ్యక్తి వచ్చాడు. పట్టణంలో పేరుపొందిన కళాకారుడు. స్కూల్ చిత్రలేఖన పోటీకి ఆయనే న్యాయనిర్ణేతగా వ్యవహరించాడు. ఆయన మాట్లాడుతూ, పోటీలో మొదటి బహుమతి వచ్చిన నీలిమ బొమ్మ గురించి ప్రత్యేకించి ప్రస్తావించాడు. ఆ బొమ్మ వెయ్యడంలో తీసుకున్న యాంగిల్ చాలా ముఖ్యమైందనీ, ముందు ముందు నీలిమ గొప్ప చిత్రకారిణి అవుతుందనీ మెచ్చుకున్నాడు. పిల్లలందరి చప్పట్ల మధ్య నీలిమ బహుమతి తీసుకుంది. బహుమతిగా చిన్న శిల్పం ఇచ్చారు. తల్లి తన బిడ్డకి పాలిచ్చే సన్నివేశం. తల్లి కళ్ళలో ఎంతో ప్రేమ కన్పిస్తోంది. ఆ బొమ్మ నీలిమకి చాలా నచ్చింది. అంతలో క్లాస్‌మేట్స్ చుట్టుముట్టి బొమ్మలాక్కున్నారు చూడ్డానికి.

వార్షికోత్సవం ముగిసింది. నీలిమ ప్రిన్సిపాల్‌ని కలుసుకుని తను వేసిన బొమ్మ అమ్మానాన్నలకి చూపించడానికి అడిగింది. ప్రిన్సిపాల్ బొమ్మనిస్తూ మర్నాడు తీసుకురమ్మనీ, దాన్ని స్కూల్ ఆడిటోరియంలో ఎగ్జిబిట్‌గా వుంచుదామనీ చెప్పింది.

నీలిమ ఇంటికొచ్చేసరికి అరుంధతి పడుకుని వుంది. జగదీశ్వరరావు అప్పుడే వచ్చాడు. నీలిమ హుషారుగా తన వేసిన బొమ్మనీ, బహుమతినీ చూపించింది ఇద్దరికీ.

"ఏం బొమ్మలో లేవే? తర్వాత చూస్తాన్లే. నా కసలే హెడేక్‌గా వుంది" అంది అరుంధతి విసుగ్గా. క్లబ్ ఫంక్షన్‌లో తన చీర కంటే చాలా ఖరీదైన చీరలు కన్పించాయి అరుంధతికి. అదే ఆమె తలనొప్పికి కారణం.

జగదీశ్వరరావు నీలిమ వేసిన బొమ్మనోసారి చూశాడు. ఒక రిక్షావాలా బొమ్మ అది. వెనక కోణం మంచి బొమ్మ గీయబడింది. రిక్షా తొక్కుతున్న మనిషి వీపు మాత్రమే కన్పిస్తుంది అందులో. రిక్షావాలా ముసలివాడై వుండాలి. నన్నటి నడుం బాగా వంగిపోయింది. అతనిలోని విషాదాన్ని సూచిస్తున్నట్టు బొమ్మలో పేలవమైన రంగులు కన్పిస్తున్నాయి. జగదీశ్వరరావు 'ఊ ' అని తల పంకించి బొమ్మ పక్కన పడేసి, బహుమతి చేతిలోకి తీసుకున్నాడు. అదీ అతణ్ణి ఏమంత ఆకర్షించలేదు.

"ఎంతుంటుందంటావ్?" అడిగాడు అరుంధతికి శిల్పం చూపిస్తూ.

"ముప్పైకంటే వుండదు. ప్రైజంటే కనీసం హండ్రెడ్ రూపీస్ అయినా వుండొద్దూ?" అంది అరుంధతి.

"యూ. దీన్ని అవతల పడెయ్యవే నీలూ! మనకి లక్ కలిసొచ్చిన సందర్భంగా నీకు మంచి లాకెట్ తెచ్చాను. చూడు. ఎంత బావుందో."

"మరి నాకేం తేలేదా?" అడిగింది అరుంధతి కొంచెం రోషంగా.

"తేకపోతే దేవిగారు ఊరుకుంటారా? ఇదుగో పట్టుచీర" ఇచ్చాడు జగదీశ్వరరావు.

అరుంధతి సంతోషంగా లేచి కూర్చుంది. చీర మడతలు విప్పి చూసింది. చాలా ఖరీదైన చీర. నలుగురికీ గర్వంగా చూపించొచ్చు. ఆమె తలనొప్పి ఎగిరిపోయింది. ఆ తర్వాత లాకెట్ చూసింది.

"వెరీనైస్! ఎప్పట్నుంచో చెబుతున్నాను మీకు. నీలూకి నాలుగు గాజులూ, గొలుసూ కొనమని. ఇన్నాళ్ళ కొకటి కొన్నారన్నమాట. రేపుదాని మారేజ్ నాటికి యాభై సవర్లన్నా బంగారం లేకపోతే ఏం బావుంటుందీ?" అంది అరుంధతి.

మళ్ళీ అదే ఫ్యూచర్ టెన్స్. నీలిమ లాకెట్ నొకసారి చూసి తల్లికిచ్చేసింది. అరుంధతి లాకెట్‌ని తను కూడా పెట్టుకుని చూసుకుంటోంది. నీలిమ నిశ్శబ్దంగా బొమ్మా, బహుమతీ తీసుకుని స్టడీ రూంలోకి వచ్చేసింది. అమ్మా, నాన్నల మాటలు తనకి రుచించలేదు. బహుమతి టేబుల్ మీద వుంచింది. దాన్ని రేపు కన్నయ్య భార్యకివ్వాలి. ఎంత బాగుంది తల్లీబిడ్డల బొమ్మ! తల్లి కళ్ళు ప్రేమ పూరితంగా వున్నాయి. కరుణ లాంటి భావాలు సూచించాల్సినప్పుడు కళ్ళు అరమూసినట్టుంటే చక్కగా వుంటుందని గోపీ మావయ్య చెప్పాడు. అందుకు ఉదాహరణగా అజంతా చిత్రాలు చూపించాడు. సరిగ్గా అలాగే శిల్పంలో తల్లి కళ్ళు అరమూసి వున్నాయి. ఈ బొమ్మ అమ్మా నాన్నల నెందుకు ఆకర్షించలేకపోయింది? ఆ లాకెట్‌లో ఏముంది? వాళ్ళెందుకు ఎప్పుడూ ఏళ్ళ తరబడి ముందు కాలోచిస్తారు? తనెందుకో ఒంటరిదై పోయినట్టు అనిపించింది నీలిమకి. నెమ్మదిగా లేచి పెన్నూ, ప్యాడ్ తీసుకుని మావయ్యకి ఉత్తరం రాయసాగింది.

"గోపీ మావయ్యా! ఇక్కడ నా కేమీ బాగుండడం లేదు. అమ్మా నాన్నా ఎంతసేపటికీ నన్నుగాక నా భవిష్యత్తునే పట్టించుకుంటారు. అన్నీ డబ్బుకి సంబంధించిన ఆలోచనలే. డబ్బునే ముఖ్యంగా కోరుకునేవాళ్ళు మనుషుల్ని ప్రేమించలేరు కదూ? ఈ మనుషుల మాటల్లో, చేష్టల్లో ఎక్కడో భలే అబద్ధం వుంది. మావయ్యా! నిన్ను మరీ మరీ చూడాలనిపిస్తోంది. మళ్ళోసారి రావా?..." ●

## మాట-మన్నన



కుంటి తైమూర్‌గా చరిత్రకెక్కిన తైమూర్ చక్రవర్తి గొప్ప బలవంతుడు. అంతేకాక సంగీతం, నృత్యం అంటే అతనికెంతో ఇష్టం. తైమూర్ ఢిల్లీపై దాడి చేశాడు. నగరంలో పేరుమోసిన గాయకురాలిని పిలిపించి పాట కచ్చేరి ఏర్పాటు చేయించాడు. గాయని పేరు షహనాబేగం.

ఆమె కంఠ మాధుర్యానికి చక్రవర్తి ముగ్ధుడయ్యాడు. కోకిల గానాన్ని మరపించగల ఆ గాయనికి దైవం అందాన్నివ్వలేదు. ఆమె కురూపి.

ఆమె గానాన్ని విన్న తైమూర్ చక్రవర్తి సంతోషంతో "గాన విద్యా దేవత బహుశా గుడ్డిది కాబోలు, కాకపోతే నీలాంటి కురూపిని ఎందుకు వరిస్తుంది?" అన్నాడు.

చక్రవర్తి మాటల్లోని హేళనను గ్రహించిన షహనాబేగం "హుజూర్ తాము చెప్పిన మాట నిజం. గాన విద్యా దేవత గుడ్డిది. అట్లే సంపదలనిచ్చే దేవతకు కూడా కళ్ళు లేవు. అందువల్లనే తమ వంటి కుంటివారిని ఆశ్రయించి తమను గొప్ప ఐశ్వర్యవంతులను చేసిందనుకుంటాను' అన్నది నిర్భయంగా.

తైమూర్ షహనాబేగం మాటల చమత్కారాన్ని మెచ్చుకున్నాడు. వెంటనే తన మెడలోని రత్నహారాన్ని ఆమెకు కానుకగా ఇచ్చాడు.

'జానమద్ది హనుమచ్ఛాస్త్రి